## క్లుప్తంగా

### వర్చువల్ రియాలటీపై వర్క్‌షాప్

కొమ్మాది: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పుల్లో వర్చువల్ రియాలిటీ ఒకటి అని, విద్యార్థులు వీఆర్‌పై అవగాహన పెంచుకుని అవకాశాలను విస్తృతం చేసుకోవాలని గీతం ప్రొఫెసర్ జీబీ సెవెన్త్‌లైన్ అన్నారు. వర్చువల్ రియాలిటీ ప్రయోజనాలను ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

### అనిల్ డెంటల్ విద్యార్థుల పరిశోధనలకు స్కాలర్‌షిప్‌లు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ డెంటల్ కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థుల పరిశోధనలకు డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం సోమవారం సంబంధిత విద్యార్థులను అభినందించింది. ఈ స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల్లో పరిశోధనల పట్ల ఆసక్తిని ప్రోత్సహించడం, కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడానికి దోహదపడతాయన్నారు. పరిశోధన కార్యక్రమాల్లో అనిల్ నీరుకొండ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు ముందంజలో ఉన్నారన్నారు. అభినందన కార్యక్రమంలో డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి, సీఈవో కె.నిరంజన్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

ఆనందపురం : స్థానికంగా ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సోమవారం అంతర పాఠశాలల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, భారత మిలటరీ అధికారి డి.వి.రెడ్డి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు మెలకువలు నేర్పి పోటీలకు సమాయత్తం చేశారు. రెండు రోజులపాటు సాగే పోటీల్లో విజేతలకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ట్రోఫీ అందజేస్తుంది. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు రేవంత్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


### కళ్లద్దాలు పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీలో సోమవారం దివీస్ సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో 120 మందికి రూ.90 వేల విలువైన కళ్లద్దాలు పంపిణీ చేశారు. గత నెలలో పరీక్షలు నిర్వహించగా అవసరమైన వారిని గుర్తించి వీటిని పంపిణీ చేసినట్టు సామాజిక సేవాధికారి ఇ.ఎస్.నాగరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు వెంపాడ సూరిబాబు, శివాజీరెడ్డి, రాజారెడ్డి, కె.నరసింహారావు పాల్గొన్నారు.

### లక్ష్య సాధనకు శ్రమించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ హరీష్‌కుమార్

తగరపువలస: ఎంచుకున్న రంగంలో ఉద్యోగాలు సాధించేందుకు యువత లక్ష్యాన్ని నిర్ణయించుకుని, అందుకు అనుగుణంగా శ్రమించాలని భీమిలి ఎస్‌ఐ గంటా హరీష్‌కుమార్ సూచించారు. సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీతో కలిసి విశ్రాంత సుబేదార్ మట్టా అప్పల నరసయ్యారెడ్డి ప్రారంభించిన ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, బీఎస్ కృష్ణా కళాశాల సూపరింటెండెంట్ జి.అప్పారావు, ఉపాధ్యాయులు పక్కి నాగేశ్వరరావు, ఎల్ఎ శ్రీనివాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ‘సురక్ష’ శిబిరాలకు విశేష స్పందన



తనిఖీలు పూర్తి చేసుకున్న వారికి మందులు, కేస్ షీట్లు అందిస్తున్న సర్పంచ్ వెంకటనారాయణ



వైఎస్సార్ పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న భీమిలి ఎంపీడీవో వెంకటరమణ, తదితరులు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని భీమిలి ఎంపీడీవో పి.వెంకటరమణ, సర్పంచ్ గాదు వెంకటనారాయణ కలిసి ప్రారంభించారు. శిబిరంలో తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, శోభారాణి, క్యాంపు వైద్యులు ఎం.దుర్గా కల్యాణి, స్పెషలిస్ట్ వైద్యులు రజని, గోవింద్, మహమ్మద్ కౌశల్, ఏఎస్ఎం గౌరి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంతి, ఆరోగ్య విస్తరణ అధికారి రాజ్‌కుమార్ తదితరులు సేవలు అందించారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా పలువురికి పరీక్షలు జరిపి వారిలో అవసరమైన వారికి శస్త్రచికిత్సలు జరిపిస్తామన్నారు. క్షయ అనుమానితులకు కఫం పరీక్షలు నిర్వహించారు. ప్రాథమికంగా హెచ్‌బీ, రక్తపోటు, మధుమేహం, డెంగ్యూ, మలేరియా, కంటి వైద్యం, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 162 రకాల మందులు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు, 18 సర్జికల్ పరికరాలు అందుబాటులో ఉంచినట్టు వైద్యులు తెలిపారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల పైడిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గాదు తాతినాయుడు, గుడ్డాల ఎల్లయ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ‘సురక్ష’లో 640 మందికి పరీక్షలు

ఆనందపురం : మండలంలోని తర్లువాడలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 640 మందిని వైద్య సిబ్బంది తనిఖీ చేశారు. ముందుగానే వలంటీర్లు రోగులను గుర్తించి టోకెన్లు అందజేయడంతో శిబిరానికి చేరుకున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు షహనాజ్‌తోపాటు ముగ్గురు వైద్య నిపుణులు, సుమారు 30 మంది వైద్య సిబ్బంది సేవలు అందించారు. 16 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరో 10 మందికి వివిధ రకాల శస్త్ర చికిత్సలు చేయించాల్సి ఉందని, వారికి ఉచితంగా సేవలు అందించడానికి పెద్దాస్పత్రులకు పంపిస్తున్నామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పద్మావతి, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, ఎంపీడీవో అడపా లవరాజు, ఈవోపీఆర్డీ కరుణాకరరావు పాల్గొన్నారు.

### జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం

పద్మనాభం: అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి సుంకర బంగారప్పడు అన్నారు. మండలంలోని తునివలసలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. అందరూ జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించారు. కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. 535 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు కిలారి సూర్యనారాయణ పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న బంగారప్పడు, ఎంపీడీవో విజయకుమార్



మెడికల్ కిట్ అందజేస్తున్న అధికారులు, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు



శింగనబందలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

## అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాన్

ఆనందపురం : మండలంలో వేములవలస ప్రధాన రహదారిపై సోమవారం వ్యాన్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ముడసల ముత్యాలమ్మ (55) వేములవలసలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచికి వెళ్లింది. అక్కడ పని ముగించుకొని నడుచుకొని తిరిగి ఇంటికి వెళ్లిపోతోంది. ఈలోగా ఆనందపురం జంక్షన్ నుంచి తగరపువలస వైపు వెళ్తున్న వ్యాన్ ముత్యాలమ్మను ఢీకొట్టి అదుపు తప్పి రోడ్డు పక్కన గల విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో విద్యుత్ స్తంభం సగానికి విరిగిపోయి వ్యాన్‌పై పడిపోయింది. ఒకేసారి పెద్ద శబ్దం రావడంతో బ్యాంక్‌లో ఉన్నవారు, చుట్టు పక్కల ఉన్న వారు పరుగులు పెట్టారు. విద్యుత్ వైర్లు తెగిపడి మంటలు చెలరేగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సకాలంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. సంఘటనా స్థలంలో గాయాలతో ఉన్న ముత్యాలమ్మను చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వ్యాన్‌ని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు.



వ్యాన్ ఢీకొనడంతో విరిగిపోయిన విద్యుత్ స్తంభం

## బాధితునికి ఆర్థిక సాయం



పాపునకు నిత్యావసర సరకులు అందజేస్తున్న ప్రతినిధులు

పద్మనాభం: పద్మనాభం క్రైం పోలీసుల దాడిలో కాలు విరిగిపోయి బాధపడుతున్న బాందేవపురం పాపునకు విశాఖపట్నం అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, డీకేఎస్ఎస్, జైబీమ్ యువజన సంఘం ప్రతినిధులు, సభ్యులు సోమవారం నిత్యావసర సరకులు, రూ.10 వేలు అందజేశారు. బాందేవపురంలో ఉన్న పాపును పరామర్శించి వీటిని అందజేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, డీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పతివాడ రాంబాబు, బూసార శ్రీను పాల్గొన్నారు.

## ‘అక్రమ క్వారీలు ఎక్కడా లేవు’



మాట్లాడుతున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: నియోజకవర్గం పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఎక్కడా అక్రమంగా క్వారీలు నిర్వహించడం లేదని, ఈ విషయంలో వస్తున్న ఆరోపణల్లో వాస్తవాలు లేవని ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో ఇటీవల జగనన్న కాలనీలు ఏర్పాటు చేసిన మేరకు అక్కడ రోడ్లు, ఇతర పనుల కోసం నిబంధనల మేరకు మట్టిని తరలించారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా ఏమీ తవ్వలేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా క్వారీల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా వీఆర్ఏలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే గనుల శాఖ అధికారులు, మధురవాడ ఏసీపీకి సమాచారం ఇచ్చామని, ఎవరైనా అక్రమంగా క్వారీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. గతంలో సంబంధిత వ్యక్తులకు జరిమానా విధించేవారని, ఇక నుంచి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు.

## 3 సచివాలయాల పరిధిలో వైద్య శిబిరం



శిబిరంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ప్రజలు

మధురవాడ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిందని జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి చెప్పారు. ఆయా యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ పరిధిలో ఒక మెడికల్ క్యాంప్ నిర్వహించాలని గతంలో నిర్ణయించారన్నారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం... ప్రతి మూడు వార్డు సచివాలయాల పరిధిలో ఒక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. 11న మారికవలసల యూపీహెచ్‌సీ పరిధిలో మారికవలస ఆర్‌జేకే కాలనీ, బోరవానిపాలెం, పరదేశిపాలెం సచివాలయాల పరిధిలోని వారికి వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఇతర ప్రాంతాల్లో కూడా 3 వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజల కోసం ఒక శిబిరం నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రెవెన్యూ విభాగంలో వింత పరిస్థితి

- సెలవులో వుంటూ ఫైల్స్ అప్రూవల్
- జీవీఎంసీ జోన్ – 2 రెవెన్యూ అధికారి లీలలు



సెలవులో ఉంటూ ఆమోదించిన ఫైల్

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2లో ప్రతి పనికీ ఒక లెక్క ఉంటుంది. కొందరు అధికారులు సెలవులో వున్నా అధికారిక సంతకాలు చేసి కీలకమైన రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఫైల్స్ కూడా అప్రూవల్ చేసేస్తున్నారు. వీటిని జోనల్ కమిషనర్ సహా డీసీఆర్, ఏడీసీలతోపాటు ప్రధాన కమిషనర్ కూడా అప్రూవల్ కొట్టేస్తున్నట్టు సమాచారం. వివరాల్లోకి వెళ్తే... జోన్ – 2 రెవెన్యూ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన పి.రమేష్ గత నెల 20 నుంచి 40 రోజుల సెలవు పెట్టారు. తర్వాత ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అప్పలరాజుకు ఇన్‌చార్జి ఆర్‌వోగా జీవీఎంసీ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. అయితే బాధ్యతలు చేపట్టి 15 రోజులు గడుస్తున్నా... ఇప్పటికీ ఆథరైజ్డ్ ఈఆర్‌పీ లాగిన్ ఇవ్వకపోవడంతో అప్పలరాజు అలంకారప్రాయంగానే విధులు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు సెలవులో ఉన్న అధికారి రమేష్ మాత్రం ఇప్పటి వరకు 110 ఫైల్స్‌కు అధికారికంగా డిజిటల్ అప్రూవల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఫైల్స్‌కే జోనల్ కమిషనర్, డీసీఆర్‌ల స్థాయిలో అప్రూవల్ లభించడం చకచకా జరిగిపోతున్నాయి.

ఈ వ్యవహారంలో ముఖ్యమైన విషయం ఏమిటంటే... సంబంధిత అధికారి సిబ్బందితోపాటు జీవీఎంసీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆయా ఫైల్స్ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి జోనల్ కమిషనర్, డీసీఆర్ స్థాయి అధికారులు పన్నులు వేయడానికి సిఫార్స్ చేయాల్సి ఉంటుంది. కానీ ఈయన మాత్రం సెలవులో ఉంటూనే అన్ని పనులనూ చేసేస్తున్నట్లు అప్రూవల్ కొట్టేస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా ఎక్కడో కూర్చుని ఫైల్స్ అప్రూవల్ చేసేస్తే... ప్రభుత్వ ఆదాయానికి గండి పడినా, ప్రభుత్వ భూములు, కోర్టు పెండింగ్ కేసులు ఉన్న ఆస్తులకు పన్నులు వేయడం వంటి పొరపాట్లు జరిగితే బాధ్యులు ఎవ్వరన్నది పెద్దప్రశ్న. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసే చేస్తున్నారా, లేదా అన్నది తేలాల్సి ఉంది.

### లాగిన్ నిలిపివేశాం

ఇదే విషయాన్ని జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి వద్ద ప్రస్తావించగా... జోన్ – 2 రెవెన్యూ విభాగం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసువెళ్లామని పేర్కొన్నారు. వారం రోజుల కిందటే లాగిన్ ఆపేశామని తెలిపారు. ఇప్పటి వరకూ అప్రూవల్ చేసిన ఫైల్స్‌కు సంబంధించి ఏదైనా పొరపాటు జరిగితే సదరు లాగిన్ వాడిన అధికారిదే బాధ్యత అని స్పష్టం చేశారు.

## అవినీతి నిర్మూలనపై అవగాహన అవసరం



చంద్రంపాలెం హైస్కూల్‌లో విద్యార్థులు, సంస్థ సభ్యులు

మధురవాడ: విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు – 2023లో భాగంగా సోమవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం వక్తృత్వం, డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు సీహెచ్‌పీ చౌదరి, పి.సుధాకర్, బాలరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు పాల్గొన్నారు.

## విద్యార్థికి ఆర్థిక సాయం

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థి బుడుమూరు హర్షవర్ధన్‌కు కళాశాల చైర్మన్ బి.నరసింగరావు సోమవారం రూ.2 వేల సాయం అందించారు. జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన హర్షవర్ధన్ ఢిల్లీ వెళ్తుండడంతో ప్రోత్సాహకంగా నగదు అందించినట్టు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని అందరూ ప్రోత్సహించాలని నరసింగరావు కోరారు.



విజయవాడలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల విస్తృత సమావేశంలో మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఇతర నాయకులు. – తగరపువలస

## ‘స్పందన’కు 17 అర్జీలు



సూపరింటెండెంట్ అప్పలరాజుకు సమస్య వివరిస్తున్న సాయిప్రియ కాలనీ వాసులు

మధురవాడ: జోన్ – 2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో సూపరింటెండెంట్ అప్పలరాజు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జోన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలుపై 17 అర్జీలు వచ్చాయి. జీవీఎంసీ 6వ వార్డు సాయిప్రియ గార్డెన్ రోడ్డులో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. తన స్థలానికి వీఎల్‌టీ కోసం జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని చినవాల్తేరుకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ ఈయాబీ రెడ్డి, చాణక్యపురి లే అవుట్‌లో సెంట్రల్ లైటింగ్, స్ట్రీట్ లైట్‌లు ఏర్పాటు చేయాలని ఎస్‌కేసీజీపీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు కోరారు. జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, సమస్య పరిష్కారమయ్యేంత వరకూ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని స్థానికులు కోరారు. కొమ్మాది జంక్షన్ నుంచి కొమ్మాది గ్రామం వరకు ఉన్న 100 అడుగుల రోడ్డులో పారిశుధ్యం మెరుగుపరచాలని, జీసీసీ లే అవుట్‌కి చెందిన రామారావు, జీవీఎంసీ 7వ వార్డు కళానగర్‌లో బాప్టిస్ట్ చర్చి వద్ద కొందరు అనధికారకంగా మేకలు కోస్తున్నారని పద్మ అనే మహిళ ఫిర్యాదు చేశారు. వీటిపై అప్పలరాజు స్పందిస్తూ జోనల్ కమిషనర్ ద్వారా ఆయా అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఆరు వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి మూడు, పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, రెవెన్యూ విభాగానికి ఒక వినతి వచ్చింది. అప్పికొండ వీధి సచివాలయాన్ని అందరికీ అందుబాటులో ఉన్న గాంధీ కళ్యాణ మండపంలోకి మార్చాలని వచ్చిన వినతిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



సంతపేట రెడ్డి వీధిలో ఉత్సవ రాట వేస్తున్న స్థానికులు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి జీవీఎంసీ రెండో వార్డు రెడ్డి సంతపేటలో స్థానికులు సోమవారం ఉత్సవ రాట వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలో మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నీలాపు సురేష్‌రెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, కిరణ్, గుజ్జు మహేష్, నీలాపు సన్యాసమ్మ, జగన్నాథ ఈశ్వరమ్మ, చేట్ల లక్ష్మి, కాకి వరలక్ష్మి, చేట్ల సూరమ్మ, వెంపాడ ఆదిలక్ష్మి, పెదగాడ విజయ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెంలో జీవీపీ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సోమవారం రాట వేశారు. అమ్మవారికి రోజూ పూజలు నిర్వహించి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

తగరపువలస: మోహిసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్, విశాఖ ఐ ఆస్పత్రి ట్రస్ట్, భీమిలి సత్యసాయి సేవా సంస్థలు సంయుక్తంగా సోమవారం భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో 303 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.తిరుమల శ్రీదేవి, ఆస్పత్రి కో ఆర్డినేటర్ సాయి కృష్ణకుమార్, సేవాదళ్ కో ఆర్డినేటర్ ఎం.సూరిబాబు, బి.ఎం.ఎస్.మూర్తి, మానాపురం వెంకట సత్యసాయికుమార్ పాల్గొన్నారు.

## సుందరంగా పోలమాంబ ఆలయం



ముత్యమాంబ అమ్మవారు



అలంకరణ పూర్తి చేసుకున్న పోలమాంబ అమ్మవారు

తగరపువలస: ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు దేవదాయశాఖ ఆధ్వర్యంలోని సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయ సముదాయం ముస్తాబయింది. ముత్యమాంబ, మరిడిమాంబ, పోలమాంబ అమ్మవార్ల విగ్రహాలతోపాటు ఆలయానికి పెయింటింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో గణపతి హోమం, చండీ హోమం, అమ్మవార్లకు జలాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. అలాగే తగరపువలస చుట్టుపక్కల పరిధిలో బైపాస్ రోడ్డులోని విజయదుర్గ ఆలయం, కొండపేట దుర్గాంబిక ఆలయం, పంప్‌హౌస్ వద్ద కనకదుర్గ ఆలయంతోపాటు భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పలుచోట్ల మండపాలు ఏర్పాటు చేసి ఉత్సవాలకు సన్నద్ధం చేస్తున్నారు. దీంతో గ్రామాలు ఉత్సవ శోభను సంతరించుకున్నాయి.

## తూర్పు కాపులను బీసీ – ఏలో చేర్చాలి

**సంఘం పెద్దలు, నూతన కమిటీ సభ్యులు**



మాట్లాడుతున్న నూతన కార్యవర్గ సభ్యులు, సంఘ పెద్దలు

మధురవాడ: తూర్పు కాపులను బీసీ – ఏ జాబితాలో చేర్చాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర తూర్పు కాపు సంఘం నాయకులు పోలాకి శ్రీనివాసరావు, సంఘం గౌరవ అధ్యక్షుడు గొర్లె వెంకటరమణ డిమాండ్ చేశారు. భీమిలి నియోజకవర్గ తూర్పు కాపు సంఘం సర్వసభ్య సమావేశం మిథిలాపురి వుడా కాలనీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు కాపులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అంశాలపై చర్చించారు. తమ కులానికి రానున్న ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన ఎక్కువ ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని, అన్ని జిల్లాల్లో ఉన్న తూర్పు కాపులకు ఓబీసీ అమలు చేయాలని, కాపు సామాజిక భవనం నిర్మాణం, తూర్పు కాపు కార్పొరేషన్ ద్వారా చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేయాలని తీర్మానాలు చేశారు. అనంతరం భీమిలి నియోజకవర్గ తూర్పు కాపు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గొర్లె మురళి నాయుడు, ఉపాధ్యక్షులుగా బెవర జగన్మోహన్, రాజాం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా పతివాడ విద్యాసాగర్, సహాయ కార్యదర్శిగా మజ్జి ధనుంజయ, కోశాధికారిగా వైఎస్ మూర్తి, కార్యవర్గ సభ్యులుగా ఉదయాన రామకృష్ణ, దంతవరపు కృష్ణమూర్తి, బొంతు రమణ, జీవీ రమణ, సంగిరెడ్డి సత్యం, గొర్లె రమణ, ముఖ్య సలహాదారుగా మరడాన రామునాయుడు, లీగల్ అడ్వైజర్‌గా శెట్టి శ్రీనివాస నాయుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మురళి నాయుడు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, తూర్పు కాపుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.